క్లుప్తంగా

మలేషియాలో 10 నుంచి శాంతి సదస్సు

మద్దిలపాలెం : మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకూ మనుజ్యోతి ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి సదస్సు జరగనున్నాయని ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుల్లో పాల్గొనాలంటూ తనకు ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. సర్వమత సౌభ్రాతృత్వం, సమాజ సేవ అంశంపై నివేదిక సమర్పించనున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మత్రిపాలెం: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఈ నెల 2న మృతిచెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్ ఆశీర్వాద్ కల్యాణ మండపం రైల్వే క్వార్టర్స్ వద్ద సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి ప్యాంట్ జేబులో అస్సాంకు చెందిన ఐడీ కార్డు ఉంది. దీంతో రేడియో మెసేజ్ ద్వారా వారికి సమాచారం అందించారు. ప్రస్తుతం అతడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తేన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునరుద్ధరణ



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గతనెల 18 నుంచి ఈనెల 4 వతేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దుచేసిన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం నుంచి ఆర్జిత సేవలు ప్రారంభించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు.అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ప్రైవేటీకరణతో దేశానికి ముప్పు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని, అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ప్రైవేటీకరణతో దేశానికి ముప్పు పొంచి ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1179వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

నాడు-నేడు స్ఫూర్తి.. ఏయూకు నవ్య దీప్తి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులు విద్యార్థులకు ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. భావితరాల అవసరాలకు అనుగుణంగా నూతన భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఫార్మా కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ భవనం ఎలిమెంట్, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్) కోసం నూతన భవనం, టెక్ స్టార్టప్ కోసం ఆ-హబ్ భవనం, పెరుగుతున్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయుక్తంగా నిర్మించిన అధునాతన అల్గారిథం భవనాలు అభివృద్ధికి సూచికలుగా దర్శనమిస్తున్నాయి. ఆధునికీకరించిన పరిపాలన భవనం ఏయూకు కార్పొరేట్ లుక్‌ను తీసుకొచ్చింది. – ఏయూ క్యాంపస్





భవిష్యత్ తరం కంప్యూటర్ నిపుణులను తయారు చేసే కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థుల కోసం అధునాతన సమావేశ మందిరాలు, తరగతి గదులు కలిగిన కంప్యూటర్ సైన్స్ భవనం 'అల్గారిథం'

కార్పొరేట్ లుక్‌తో ఆధునికీకరించిన ఏయూ పరిపాలన భవనం



ఫార్మసీ పరిశోధనలకు ఉపయుక్తంగా విద్యార్థుల ఆవిష్కరణలకు వేదికగా నిలిచే ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ 'ఎలిమెంట్' భవనం



అంతర్జాతీయ ప్రమాణాలతో మేనేజ్‌మెంట్ విద్యను అందించే స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ భవనం



ఆవిష్కరణలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వేదికగా, సంపద సృష్టించే కేంద్రంగా నిలిచే స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'

దివాకర్‌రావుకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థి పి.దివాకరరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. విద్యా విభాగం విశ్రాంత ఆచార్యులు నిమ్మ వెంకటరావు, విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు సంయుక్త పర్యవేక్షణలో ×శ్రీకాకుళం జిల్లాలో మాధ్యమిక పాఠశాలల్లో గణితం, ఆంగ్ల నేర్చుకునే దిశగా పదో తరగతి విద్యార్థుల అవగాహనపై అధ్యయనం౯అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి దివాకర్‌రావు డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

మన ఓటు.. మన భవిత



చిరుధాన్యాలతో చేసిన చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎస్.హరనాథ్

ఏయూ క్యాంపస్: మన ఓటు మన బాధ్యత, ఇది మన భవితను నిర్దేశిస్తుందని ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించడంలో భాగంగా నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలతో తీర్చిదిద్దిన మన ఓటు.. మన భవిత చిత్రపటాన్ని హరనాథ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు పల్లవి, చంద్రకళ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ బాగుండాలి అనే భావన ప్రధానం

- జీవితం ఒక నడకగా భావించాలి
- ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



గరికపాటి దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ కార్యవర్గం

ఏయూ క్యాంపస్: సమాజంలో అందరూ బాగుండాలి అనే భావనతో ప్రతి వ్యక్తి ఆకాంక్షించాలని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లోక కల్యాణం కోసం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. జీవితాన్ని ఒక నడకగా భావించాలన్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా మన నడక మనం సాగిస్తామని, అదే విధంగా జీవితంలో ముందుకు సాగాలన్నారు. సంసారాన్ని సాగరంతో పోలుస్తారని, ఇక్కడ ఉన్నవారు సాగరాన్ని చూస్తే ఎన్నో జీవిత సత్యాలు తెలుసుకోవచ్చునన్నారు. నేను అనే భావన మన మనసుల్లో తొలగాలన్నారు. మన స్థితి, గ్రహస్థితి బాగుండాలంటే పరమేశ్వరుడిని మన హృదయంలోకి ఆహ్వానించాలని సూచించారు. సమాజంలో వ్యాపార ధోరణ లేదని, మనిషి మనస్సులో ఉన్న వ్యాపార ధోరణిని ముందుగా తరిమివేయాలని పిలుపునిచ్చారు. కష్టాలను అధిగమించే ధైర్యాన్ని ఇవ్వాలని దైవాన్ని అడగాలన్నారు. వైరాగ్యాన్ని అవలంబిస్తే జీవితం వైకుంఠంగా మారుతుందన్నారు. మనకు ఉన్నది చాలు అనే భావనే వైరాగ్యమన్నారు. సూర్యభగవానుడి దశలను పరిశీలిస్తే మన జీవితానికి దగ్గరగా ఉంటుందన్నారు. పురాణాలను వైజ్ఞానికంగా అర్థం చేసుకోవాలని సూచించారు. అనంతరం గరికపాటి దంపతులను సీషోర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి జి.తిరుపతిరావు, కోశాధికారి ఎం.ఎ స్.నాయుడు, క్లబ్ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా పెదగదిలి వంతెన పనులు



తుది దశకు చేరిన పెదగదిలి బ్రిడ్జి పనులు

ఆరిలోవ: పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గెడ్డపై తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.3.5 కోట్లు నిధులతో జీవీఎంసీ చేపడుతున్న ఈ వంతెన కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే బ్రిడ్జి కోసం గెడ్డలో అవసరమైన స్తంభాలు, వాటిపై శ్లాబు పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా కొంత దూరంలో తారు రోడ్డు వేయాల్సి ఉంది. ఈ వంతెన పూర్తయితే బీఆర్‌టీఎస్ నుంచి పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, రవీంద్రనగర్, ఆరిలోవకు ప్రధాన రహదారి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే రాకపోకలకు చాలా సౌలభ్యంగా ఉంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంవీవీకి చర్చి ఫాదర్ల ఆశీర్వాదం



ఎంవీవీని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం తూర్పు నియోజకవర్గంలోని పలు చర్చిలను సందర్శించారు. చర్చిల ఫాదర్ల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆరిలోవ, విశాలాక్షినగర్, చినవాల్తేరు, లాసన్స్‌బే కాలనీ, శివాజీపాలెం, వెంకోజీపాలెం, సింహాద్రిపురం, తదితర ప్రాంతాల చర్చిల్లో ఎంవీవీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలోని లూథర్ మాత చర్చిలో ఫాదర్ నుంచి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, అధ్యక్షుడు పీలా వెంకట్, గొలగాని త్రినాధరావు, వెంకటలక్ష్మి, పైడి నాయుడు, ధర్మ, చర్చి ఫాదర్ శామ్యూల్ కర్మోజీ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సత్కారం



బార్ అసోసియేషన్ కార్యవర్గంతో అతిథులు

దాబాగార్డెన్స్ : మానవహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి డీఎస్ఎన్ఎల్‌యూ ఫస్ట్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ మీట్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విశాఖ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి నరేష్‌కుమార్‌తో పాటు పోలీస్ కంప్లెయింట్ అథారిటీ సభ్యులు కె. రంగరాజు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఎస్. దివాకర్‌ను సత్కరించారు. భవిష్యత్‌లో బార్ అసోసియేషన్ తరఫున మానవ హక్కుల సంఘానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్‌కు చెందిన వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సర్కారులో అందరికీ సంక్షేమం



మునసబు వారి వీధి వాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



ఎంవీవీకి హారతులిస్తూ స్వాగతం పలుకుతున్న కాలనీ మహిళలు

- ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 20వ వార్డు పెదవాల్తేరులో ఆత్మీయ సమావేశం

ఏయూ క్యాంపస్: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమాన సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ సర్కారుకు దక్కుతుందని ఆ పార్టీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో మునసబు వారి వీధిలో బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంతిల్లు, పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి వైద్యం అందించడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ రూపొందించి శతశాతం అమలు చేశారన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు గెలిచిన వెలగపూడి ఎప్పుడైనా మీ సంక్షేమం, మీ ప్రాంతం అభివృద్ధి కోసం ఆలోచించారా? అని ఒక్కసారి ప్రశ్నించుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంవీవీని కాలనీ వాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్, మద్ది వెంకటరమణ, రామిరెడ్డి, మల్లికార్జున, మద్ది రమణమ్మ, కాలనీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



ఎంవీపీ కాలనీ: 17వ వార్డులో ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, ప్రేమ్ కిరణ్, తదితరులు



ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, ఎంవీవీ సత్యనారాయణకు మద్దతుగా 12వ వార్డులో ప్రచారం చేస్తున్న ఆ పార్టీ క్లస్టర్-1 మండల ఉపాధ్యక్షుడు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, కిశోర్‌రెడ్డి, కన్వీనర్లు



ఎంవీపీ కాలనీ: జగనన్న సర్కారు మళ్లీ రావాలంటూ 18వ వార్డు గోవాగార్డెన్‌లో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, సతీష్, గోపి, ఈశ్వరరావు, కల్యాణ్




ఏయూ క్యాంపస్: 22వ వార్డులో మహిళా కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్



ఏయూ క్యాంపస్: క్రీడాకారులకు కరపత్రం అందిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీసీవై పార్టీ అభ్యర్థి యడ్ల వేణుగోపాల కృష్ణ



బీచ్ రోడ్డు: 28వ వార్డు నెహ్రూనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు



బీచ్ రోడ్డు: 15వ వార్డు సింహాద్రిపురంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్న పార్టీ నాయకులు అప్పారి గిరిబాబు, పి.వెంకట్

సేవా ప్రాజెక్టులకు నిధుల మంజూరు



రోటరీ ప్రముఖులను సత్కరించిన నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : రోటరీ ఇంటర్నేషనల్ మానవతా సేవా ప్రాజెక్టుల అమలుకు నిధులు మంజూరు చేస్తుందని, అలాగే ప్రపంచంలోని పర్యావరణ అసమతుల్యతను తగ్గించడానికి పర్యావరణ ప్రాజెక్టులు కూడా చేపట్టిందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ చెప్పారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం రోటరీ జిల్లా సహాయ నిధి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. వేంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి అమరావతి వరకు గల 82 రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని చెప్పారు. 3020లో మరిన్ని మానవతా సేవా కార్యక్రమాలు చేసేందుకు అవసరమైన ప్రాజెక్టులు గుర్తించాలని పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సామ్ మువ్వ సూచించారు. ఆర్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ ఇంటర్నేషనల్ నుంచి మరిన్ని నిధులు పొందేందుకు సహకరించాలన్నారు. జిల్లా, రోటరీ ఇంటర్నేషనల్ నుంచి గ్రాంట్లు పొందడానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను జి.విశ్వనాథ్ వివరించారు.

అలరించిన 'వినోదాల విందు'

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వినోదాల విందు కార్యక్రమం ఆద్యంతం అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు, కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, జె.ఎల్.నరసింహం, కె.ఎల్.కామేశ్వరరావు, డేవిడ్ రాజు, కుమారి, రావి గోపి, భాను ప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, భాస్కరాచారి ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో ఆక్సిడెంట్ రక్షించి, డాక్టర్ పేషెంట్, విడాకులు, మ్యారేజ్ బ్యూరో, పార్టీ, ఇంటర్వ్యూ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అనంతరం పలువురు కళాకారులను, వివిధ రంగాలలో సేవలందించిన పలువురిని సత్కరించారు.